# గోంగూరోపాఖ్యానం

ఆ రోజు హైవే టెన్ మీద ఏదో కారు ప్రమాదం జరిగినట్టుంది. ట్రాఫిక్ అంతా ఆగిపోయింది. బాగా వాన పడుతున్నది. రోడ్డు లైట్ల వెలుగులో మెరుస్తున్నది. కారులో రాక్ సంగీతం తలనెప్పి తెప్పిస్తున్నది. రేడియో ఆపేశాడు విక్రమరావ్. విసుగ్గా ట్రాఫిక్ కదలటం కోసం, ఎదురు చూస్తూ ఆలోచిస్తున్నాడు. మంచి ఆకలిగా వుంది. వాళ్ళావిడ గుంటూరు నుంచి తెచ్చిన గోంగూర పచ్చడి తినాలి ఇవాళ - ఉల్లిపాయలు సన్నగా కత్తిరించుకుని నంజుకు తింటే, దానికి వున్న రుచి ప్రపంచంలో ఇంకే వంటకంలోనూ ఉండదు. అసలు గోంగూర పచ్చడి కనిపెట్టినవాళ్ళకి నోబుల్ ప్రైజ్ వచ్చిందా? ఇండియన్ కాబట్టి ఇచ్చి వుండరు. అదే అమెరికన్‌గానీ, జర్మన్‌కానీ, అయితే ఎప్పుడో యిచ్చి వుండేవారు - గోంగూర గురించి ఆలోచిస్తుంటే ఆకలి ఇంకా ఎక్కువయింది. అప్పుడే అనుకున్నాను - కనీసం అమెరికా బేతాళుడు ప్రక్కన వుంటే కాస్త కాలక్షేపం అన్నా అవుతుందని - ఈలోగా ప్రక్కనుంచి ఒక అంబులెన్సు అరుచుకుంటూ వెళ్ళింది. 'అయితే పెద్ద యాక్సిడెంటే అయివుండాలి' అనుకున్నాడు.




"ఏం గురూ - ఆకలి దంచేస్తున్నదా?" అన్నాడు ముందు సీట్లో ప్రత్యక్షమవుతూ అమెరికా బేతాళుడు.

"ఆఁ! రావయ్యా రా - నీ కోసమే చూస్తున్నాను - -" అన్నాడు విక్రమరావ్.

"అయితే నీకొక కథ చెబుతాను - విను. ఆ కథ పూర్తవగానే నిన్నో ప్రశ్న అడుగు తాను. దానికి జవాబు తెలిసీ చెప్పకపోయావో - నీ కారు టైర్లు బ్రద్దలయిపోతాయి -"

"తెలుసులేవోయ్ బేతాళుడూ - మొదటి రెండు కథలలోనూ - ఆ సంగతి చెప్పాంగా. మళ్ళీ మళ్ళీ ఎందుకు చెప్పడం? - నీ కథ ప్రారంభించు" - విక్రమ రావ్‌కి మూడు రోజుల పరిచయంతో, బేతాళుడితో స్నేహం కూడా కుదిరింది.



"ఈసారి చాలా విచిత్రమైన కథ చెబుతాను. ఇది నిజంగా జరిగిన కథ. ఈ హ్యూస్టన్ నగరంలో లాంగ్ పాయింట్ అండ్ విట్టీ రోడ్డు మీద ఒక పెద్ద అపార్టుమెంట్ కాంప్లెక్స్ వుంది. అక్కడ విట్టీ రోడ్డు మీద రెండవ అంతస్థులో వున్న రెండు పడక గదుల ఎపార్టు మెంటులో అద్దెకు వుంటున్నారు రామారావ్‌గారూ, లక్ష్మిగారూ. మరి - -"

"పాత్రల పరిచయం అయింది కనుక - ఇక కథ మొదలు పెట్టవయ్యా, బేతాళుడూ" అన్నాడు విక్రమరావ్ - కార్లు నెమ్మదిగా కదలటం చూసి, కొంచెం ఉత్సాహం పుంజుకుని.

"చెబుతున్నాను - చెబుతున్నాను - అమెరికాలో వుంటున్నా, రామారావ్‌గారికి శుభ్రమైన తెలుగు భోజనం రెండు పూటలా కడుపులో పడితేగాని తృప్తిగా వుండదు. అందులోనూ లక్ష్మిగారి వంట చాలా బాగుంటుంది. అందుకని ఆయన రెండు నెలల కొకసారి, కొత్త సైజు పాంట్‌లోకి కూడా మారిపోతూ వుంటాడు -"

"భేతాళుడూ - నేను అసలే ఆకలితో చస్తుంటే - నువ్వు తిండి కథ చెబుతావేం. మా ఆవిడ గోంగూర పచ్చడి వడ్డిస్తున్నదివాళ - అందులోనూ గుంటూరు - -"

"హాచ్చెర్యం గురూ" - అని బోలెడు హాచ్చర్యం పడిపోయాడు హఠాత్తుగా బేతాళుడు. పడటం ఆపి అన్నాడు - "చూశావా -- నేను యివాళ నీకు గోంగూర కథే చెప్పబోతున్నాను. - నువ్వు గోంగూర గురించే ఆలోచిస్తున్నావు. ఉయ్ ఆర్ మేడ్ ఫర్ ఈచ్ అదర్".'

"నీ ముఖం. అలాంటి మాటలనకు అమెరికాలో - ఇద్దరం మగవాళ్ళం - మేడ్ ఫర్ ఈచ్ అదర్ అంటే - ఇంకేదో అనుకుంటారు అంతా - సరే కానీ, నీ గోంగూర కథ" ఆసక్తిగా అడిగాడు విక్రమరావ్.

“ఓ.కె. - ఎక్కడ వున్నాను - యా - రామారావ్‌గారు, రంగారావుగారు ఇచ్చిన గుంటూరు గోంగూర విత్తనాలను, పెరట్లో నాటటానికి పెరడు లేదు కనుక, ముందు బాల్కనీలో ఒక పెద్ద తొట్లో వేసి, రోజూ నీళ్ళు, వారానికి ఒకసారి 'మిరకిల్ గ్రో' ఎరువు వేసి, ఆ గోంగూర చెట్టుని ఏపుగా పెంచారు. ఒకటి రెండు సార్లు పప్పు పచ్చడి చేసుకుని, ఆత్మారాముడ్ని సంతృప్తి పరిచారు కూడాను. ఒక రోజు మధ్యాహ్నం లక్ష్మిగారు సోప్ ఆపరా చూస్తున్నారు. సోప్ ఆపరా అంటే సోప్ కంపెనీలు స్పాన్సర్ చేసే సీరియల్ కథలు. సంవత్సరాల తరబడి అలా కథలు అల్లుతూనే వుంటారు - పెళ్లికాని తల్లుల గురించి, మొగుళ్ళను మోసం చేసే పెళ్ళాల గురించి, పెళ్ళాలని పదో అంతస్థు నించి క్రిందకు తోసే మొగుళ్ళను గురించి, ఎవరి మొగుడో, ఎవరి పెళ్ళాంతోనే పెట్టుకున్న సంబంధాల గురించీ - మన హిందీ సినిమా/ తెలుగు నవలల కన్నా అధ్వాన్నమయిన కథలతో జనాన్ని మభ్య పెడుతుంటాయి ఈ కథలు. సరే! అసలు విషయం, అప్పుడే ఆవిడకు బాల్కనీలో ఎవరో తచ్చాడుతున్నట్లు అనుమానం వచ్చింది. గబ గబా వచ్చి కిటికీలో నించి చూశారావిడ. ఒక పదిహేనేళ్ళ కుర్రాడు, గోంగూర చెట్టు దగ్గర నుంచుని, ఆ ఆకుల వేపు చూస్తున్నాడు. సోప్ ఆపరా వస్తున్న టి.వి. సెట్టు ఎత్తుకు పోయినా, ఇంకో టీ.వి. కొనుక్కోవచ్చు కానీ, గోంగూర చెట్టు పోతే ఇంక బ్రతకగలమా- అనుకుని, గాబరాపడి - తలుపు తీశారావిడ. ఇంతకు ముందొకటి, రెండుసార్లు ఇలాగే జరిగింది. తను తలుపు తీయగానే, పారిపోయాడు ఆ కుర్రవాడు. అందుకే ఈసారి నెమ్మదిగా తలుపు తీశారావిడ. ఆవిడ్ని చూసి, బెదిరి పారిపోలేదు కుర్రవాడు - తెల్ల అబ్బాయి. ఆవిడ్ని చూసి చిరునవ్వు నవ్వాడు. “నాక్కొంచెం ఇస్తావా?” అని అడిగాడు నెమ్మదిగా. ఆవిడ అన్నారు - “నీకెందుకు - ఇది గోంగూర - పచ్చడి చేసుకోవచ్చు - పప్పులో వేసుకోవచ్చు - నీకవేమిటో తెలివాయె - అది హేంబర్గరులో బాగుండదు -”

“ఒక్క ఆకు చాలు” అన్నాడు కొంచెం భయం భయంగా.

పోనీలే తెల్ల కుర్రాడు - ఇవ్వనంటే ఇదేమిట్రా అనుకుని ఇంకా తెల్లబోతాడేమో అనుకుని - ఒక ఆకుని సుతారంగా కోసి - ఆ కుర్రాడి చేతిలో పెట్టిందావిడ.

'థేంక్స్' అని ఉత్సాహంగా వెళ్ళాడు ఆ కుర్రాడు” - ఆగాడు అమెరికా బేతాళుడు.

“నువ్వు చెప్పే ఈ కథకి అర్థం పర్థంలేదు బేతాళుడూ - ఒక ఆకు గోంగూర వాడేం చేసుకుంటాడు. ట్రాఫిక్ కూడా బాగా పోతున్నది కానీ, నీ కథ ఎక్కడికి పోతుందో అర్థం కావటం లేదు -” విక్రమరావ్ విసుగ్గా అన్నాడు.

“పెట్టు వదలని విక్రమార్కుడూ - విసుక్కోకు. వస్తున్నాను అసలు పాయింటుకి - ఆ రోజు సాయంత్రం రామారావ్‌గారు ఇంటికి రాగానే లక్ష్మిగారు ఆయనికి జరిగిందంతా చెప్పారు. ఆయన, “ఏదో కుర్ర వెధవ ఆ ఆకు మీద ఆసక్తి కలిగి వుంటుంది. రుచి చూడటం కోసం అడిగివుంటాడు” అన్నాడు. అంటూనే “లక్ష్మి - మన రోడ్డు పక్కన రెండు పోలీసు కార్లు ఆగి వున్నాయి. నేను వచ్చేటప్పుడు చూశాను. ఆ పోలీసులు మన అపార్ట్‌మెంటు

వేపే చూస్తూ నుంచున్నారు - ఎందుకో మరి" అన్నారు.

"నిజమా!" అని ఆవిడ కిటికీలో నించి బయటకు చూశారు. అప్పుడే ఇద్దరు పోలీసులు తమ అపార్టుమెంటు వైపు రాసాగారు. చటుక్కున కర్టెన్ మూసేసి, "ఏమండీ - యిటే వస్తున్నారు పోలీసులు" అన్నారు గాబరాగా.

రామారావ్‌గారు అసలే గాబరా మనిషి. పోలీసులు అనగానే ఇంకా గాబరా ఎక్కువ అయింది - వెన్నులో కాస్త వణుకు కూడా వచ్చింది కూడాను.

ఈ లోపల కాలింగ్ బెల్ మోగింది కూడాను.

"లక్ష్మీ నువ్వు తలుపు తీయి" అని ఆయన గాబరా పడటం కంటిన్యూ చేయసాగారు.

ఆవిడ తలుపు తీయగానే - ఇద్దరు ఆఫీసర్లూ (పోలీసులు, కాప్, ఆఫీసర్ అన్నీ ఇక్కడి పోలీసులకు పేర్లు) చిరునవ్వు నవ్వారు. ఒక ఆఫీసర్ ఎర్రతను, తెల్ల పళ్ళని చూపిస్తూ చిరునవ్వు నవ్వాడు. రెండవ అతను నల్లతను. అయినా అతను కూడా తెల్ల పళ్ళనే చూపిస్తూ నవ్వాడు - తేడా అంతా పైనే కాని, శరీరం లోపల తెలుపూ, నలుపూ, గోధుమ రంగూ అన్నీ ఒక్కటే అని సూచిస్తూ.

లక్ష్మిగారు కూడా నవ్వి - "యస్ - ఆఫీసర్" అన్నారు.

రామారావ్‌గారు నవ్వుదామనుకుని, నవ్వటం, గాబరా పడటం రెండు వేరు వేరు రసాలు కనుకా, అవి రెండూ ఒకేసారి ముఖంలో చూపించడం కష్టం కనుకా, నవ్వటం మానేసి, గాబరా పడటం కొనసాగించారు.

ఎర్ర పోలీసు అడిగాడు - "ఇది ఏం మొక్క?" అని గోంగూర మొక్కని చూపిస్తూ.

'నీ దుంప తెగా - నీకూ మా గోంగూర మొక్క మీదే పడ్డాయా కళ్ళు' అనుకుని ఆవిడ పైకి మాత్రం, "గోంగూర" అన్నది.

నల్ల పోలీసు, నల్ల కనుబొమ్మల్ని చిట్లించి - "వాట్" అన్నాడు.

ఎర్ర పోలీసు "గోంగూర--ట" అన్నాడు ఇంగ్లీషులో.

" 'ట'ని ఇంగ్లీష్‌లో ఏమంటారు? - నువ్వు సరిగ్గా అనువాదం చేస్తున్నట్టు లేదు" - అన్నాడు విక్రమరావ్. పోయినసారి జపాన్ ప్రైమ్ మినిష్టర్ వచ్చి, వైట్ హౌస్‌లో మాట్లాడి నప్పుడూ ఇదే అనుమానం వచ్చింది విక్రమరావ్‌కు. ఆయన పది నిమిషాలు దీర్ఘంగా మాట్లాడితే, అనువాదకుడు, రెండు నిమిషాల్లో అవకొట్టేవాడు. జపాన్ ఆయన కొట్టేట్టు మాట్లాడితే, అనువాదం సుతిమెత్తగా వుండేది.

"అసలు కథ వదిలేసి, నువ్వు లైన్ల మధ్య చదువుతావేం - ఈ తెలివిగల విక్రమార్కుల మూర్ఖత్వం అక్కడే వుంది" విసుక్కున్నాడు బేతాళుడు. విసుక్కోవటం ఆపి - కథ చెప్పటం సాగించాడు.



“ఒక ఆకుని కోసుకోవచ్చా!” అని అడిగాడు ఎర్ర పోలీసు.

గోంగూర ఇవ్వవలసి వచ్చేటప్పటికి, రామారావ్‌గారు కొంచెం ధైర్యం చేసుకుని ముందుకు వచ్చి, “మీకెందుకు - ఇది గోంగూర - పచ్చడి చేసుకోవచ్చు, పప్పులో వేసుకోవచ్చు - మీకవేమిటో తెలీదాయె - అది హేంబర్గరులో బాగుండదు -” అన్నారు.

లక్ష్మి నెమ్మదిగా, “ఏమండీ - ఇందాక నేను సరిగ్గా అదే డైలాగు ఆ తెల్ల కుర్రాడితో అన్నాను - మీరు నా డైలాగుని - -” అన్నారు తెలుగులో.

తెలుగు తెలియని నల్ల పోలీసు ఒక ఆకుని, ఎర్ర పోలీసు రెండు ఆకుల్ని కోసి వాసన చూశారు. నోట్లో వేసుకున్నారు - తెల్లబోయి చూస్తున్న లక్ష్మిగారిని, గోంగూర కోసుకున్నందుకు ముఖం ఎర్రబడిన రామారావ్‌గారిని ఒకసారి తీక్షణంగా చూశారు ఇద్దరు పోలీసులూ” - బేతాళుడు కథ చెప్పటం ఆపాడు.

“ఊఁ! తరువాత” అన్నాడు విక్రమరావ్.

“తర్వాత నేను కాదు చెప్పాల్సింది నువ్వు. తరువాత ఏమయింది? - పోలీసులు

అసలు ఎందుకు వచ్చారు? - గోంగూర పెంచటంలో తప్పేముంది? రామారావ్‌గారు, లక్ష్మిగారు తర్వాత ఏమి చేశారు? - ఈ ప్రశ్నలకి జవాబులు వెండితెర మీద చూడటానికి కుదరదు. ఈ దేశంలో వెండితెరలు వుండవు. అన్నీ గుడ్డ తెరలే - అందుకని నువ్వు చెప్పు జవాబు. తెలిసీ చెప్పకపోయావో, నీ - - - "

"తెలుసులేవోయ్ - చెవలాయ్-" ఒక క్షణం ఆలోచించి విక్రమరావ్ అన్నాడు.

"గోంగూర దూరం నించి చూస్తే అచ్చం మెరివానా ఆకులాగా వుంటుంది. మెరివానా, హాషీష్, నల్లమందు లాంటివన్నీ - ఈ దేశంలో బహిష్కరించబడ్డవి కదా, ఎవరి దగ్గరన్నా వుంటే వాళ్ళని శ్రీ కృష్ణజన్మస్థానానికి పంపిస్తారు. అందుకే ఆ కుర్రాడు ముందర అవి 'డ్రగ్స్' కి సంబంధమయిన ఆకులు అనుకుని, తీసుకుపోవటానికి వచ్చాడు. పోలీసులు కూడా రోడ్డు మీద నించి చూసి, అనుమానంతో పరీక్ష చేశారు. నోట్లో వేసుకుని, వాసన చూసి పరీక్ష చేసిన తరువాత తెలిసింది. ఇదేదో గోంగూర సంబంధం కానీ, డ్రగ్ సంబంధం కాదనీ, అది వాళ్ళు చెప్పేక, రామారావుగారికి, లక్ష్మిగారికి మనసు తేలిక పడింది - లక్ష్మిగారు ఆ పోలీసులని కూర్చోపెట్టి, గోంగూర ఎంత ప్రశస్తమైందో చెప్పి, ఒక సీసాలో గోంగూర పచ్చడి ఇచ్చారు, పోలీసులకు (హతవిధీ!). రామారావుగారు మాత్రం మాట్లాడకుండా బాల్కనీ నుంచి, గోంగూర మొక్క వున్న తొట్టిని లివింగ్ రూమ్‌లోకి తీసుకువచ్చి టీ.వి. ప్రక్కనే పెట్టి - సోఫాలో పడుకుని, గోంగూర వాసన చూస్తూ నిద్రపోయారు - అదీ కథ - -" ప్రక్కకి తిరిగి చూసేసరికి బేతాళుడు అప్పటికే మాయం అయి, మళ్ళీ కనబడకుండాపోయాడు.

తన ఇంటి డ్రైవ్ వేలో కార్కు పార్కు చేసి దిగగానే, ఇంట్లోంచి పోపు పెట్టిన గోంగూర పచ్చడి వాసన ఘుమాయించింది. "ఆహా - నా జీవితమే ధన్యం కదా" అనుకుంటూ ఇంట్లోకి వెళ్ళాడు విక్రమరావ్.

❖